# నయమాను ని
# ఏడు మునకలు



పరిశుద్ధ గ్రంథం యొక్క ప్రాథమిక సత్యాలు

**పాఠం -- 17**

# నయమానుని ఏడు మునకలు

పాత నిబంధనలో జరిగిన నయమాను కుష్ఠురోగం నివారణకు, అతడు యొర్దానులో ఏడుసార్లు మునిగి శుద్ధుడైన సంఘటనను పరిశీలించేలా,

- ✓నయమాను ఎవరు?
- ✓నయమాను పని ఏమిటి?
- ✓నయమాను ఏ ప్రాంతపు వాడు?
- ✓నయమాను కుష్ఠురోగం ఎలా నయమైంది?
- ✓ఈ కుష్ఠురోగాన్ని గురించి లేఖనాలు ఏమి చెబుతున్నాయి?
- ✓కుష్ఠురోగం యొక్క ప్రభావం ఏమిటి?
- ✓నయమాను కుష్ఠురోగం నయం కావడానికి యొర్దానులో ఏడుసార్లు మునగడం దేనిని సూచిస్తుంది?
- ✓ఈ అన్యుడైన నయమాను కు మాత్రమే ఈ కుష్ఠువ్యాధి నుండి విడుదల లభించడంలోని రహస్యం ఏమిటి?

ఇలా పాత నిబంధనలో చెప్పబడిన సంఘటనలు చంద్రుని వెలుతురు వలె మసకగా కనిపిస్తాయి. కానీ దానిని కొత్త నిబంధన అనే సూర్యుని వెలుతురులో చూసినప్పుడు, అది మనకు బోధనలను, హెచ్చరికలను మరియు నిరీక్షణను ఇచ్చే మాదిరిలుగా ఉన్నాయి. కాబట్టి వీటిని గురించి లేఖనాల ఆధారంగా వివరంగా పరిశీలిద్దాం.

## ➡ కుష్టురోగియైన నయమాను చరిత్ర

**2 రాజులు 5 : 1 – 3**

**1 సిరియారాజు సైన్యాధిపతియైన నయమాను అను నొకడుండెను.**
**అతని చేత యెహోవాయే సిరియా దేశమునకు జయము కలుగజేసి**
**యుండెను గనుక అతడు తన యజమానుని దృష్టికి ఘనుడై దయపొందిన**
**వాడాయెను. అతడు మహా పరాక్రమశాలియై యుండెను గాని అతడు కుష్ఠ**
**రోగి.**
**2 సిరియనులు గుంపు గుంపులుగా బయలుదేరి ఇశ్రాయేలు దేశము**
**మీదికి పోయి యుండిరి. వారచ్చట నుండి యొక చిన్నదాని చెరగొని తేగా,**
**అది నయమాను భార్యకు పరిచారము చేయుచుండెను.**
**3 అది షోమ్రోనులోనున్న ప్రవక్త దగ్గర నా యేలిన వాడుండవలెనని నేనెంతో**
**కోరుచున్నాను; అతడు నా యేలినవానికి కలిగిన కుష్ఠరోగమును**
**బాగుచేయునని తన యజమానురాలితో అనెను.**

సిరియా దేశపు సేనాధిపతియైన నయమాను తన రాజు దగ్గర గొప్ప మనిషిగా ఉండెను. అతని ద్వారా యెహోవా సిరియాకు అనేక విజయాలను ఇచ్చెను. అతడు గొప్ప పరాక్రమశాలి. కానీ, అతడు కుష్ఠురోగిగా ఉండెను. వీరు యుద్ధానికి వెళ్ళినప్పుడు ఇశ్రాయేలు దేశం నుండి ఒక చిన్నదానిని చెరపట్టుకొని వచ్చారు. ఈ చిన్నది నయమాను భార్యకు పరిచర్య చేయుచుండెను. ఆమె తన యజమాని కుష్టువ్యాధిని చూసి, తన యజమానురాలితో, ఇతడు సమరయలో ఉన్న ప్రవక్త దగ్గరకు వెళ్ళిన యెడల బాగుండును. ఆయన ఇతని కుష్టువ్యాధిని నివారణ చేస్తాడని చెప్పెను. ఇలా చెప్పిన మాటను విని ఆమె దానిని నయమానుతో చెప్పెను.

## ఇశ్రాయేలు రాజుకు పత్రిక

**2 రాజులు 5 : 4 – 6**

**4 నయమాను రాజు నొద్దకు పోయి ఇశ్రాయేలు దేశపు చిన్నది చెప్పిన**

**మాటలను అతనికి తెలియజేయగా**
**5 సిరియా రాజు నేను ఇశ్రాయేలు రాజునకు దూత చేత పత్రిక**
**పంపించెదనని ఆజ్ఞ ఇచ్చెను గనుక అతడు ఇరువది మణుగుల వెండియు**
**లక్ష యిరువది వేల రూపాయిల బంగారును పది దుస్తుల బట్టలను**
**తీసికొని పోయి ఇశ్రాయేలు రాజునకు పత్రికను అప్పగించెను.**

నయమాను భార్య ఇశ్రాయేలు నుండి చెరపట్టబడిన చిన్నది చెప్పిన దానిని తన భర్తతో చెప్పెను. దీనిని నయమాను తన రాజుకు తెలియజేసెను. దీనిని, విన్న సిరియా దేశపు రాజు, వెంటనే ఇశ్రాయేలు రాజుకు పత్రిక ఇస్తానని చెప్పి, పత్రికను వ్రాసి ఇచ్చి నయమాను ను ఇశ్రాయేలుకు పంపెను. అప్పుడు నయమాను తనతో కూడా 340 కి. గ్రా. వెండిని, 6000 తులాల బంగారాన్ని, 10 జతల వస్త్రాలను తీసుకొని వెళ్లి ఇశ్రాయేలు రాజుకు ఆ పత్రికను ఇచ్చెను. ఆ పత్రికలో ఏమి వ్రాయబడి ఉందంటే, ఈ పత్రికను తీసుకొని వచ్చే నా సేవకుడైన నయమాను యొక్క కుష్ఠురోగమును నీవు నివారణ చేయవలెను అని అందులో వ్రాయబడి ఉండెను.

## ఇశ్రాయేలు రాజు వస్త్రాలను చించుకొనుట

**2 రాజులు 5 : 7**

**ఇశ్రాయేలు రాజు ఈ పత్రికను చదివి వస్త్రములు చింపుకొని ...**

సిరియా రాజు నయమాను ద్వారా పంపిన పత్రికను చదివిన ఇశ్రాయేలు రాజు, తన వస్త్రములను చించుకొని, నయమాను కుష్టువ్యాధిని నివారణ చేయుటకు నేను చంపడానికిని, బ్రతికించడానికిని దేవుడనా? ఇతడు నాతో జగడమాడటానికి సమయం వెతుకుతున్నాడని ఆలోచించండి అని అంగలార్చుచుండెను.

## ఎలీషా రాజు దగ్గరకు వార్త పంపుట

**2 రాజులు 5 : 8 – 9**

**ఇశ్రాయేలు రాజు తన వస్త్రమును చింపుకొనిన సంగతి దైవజనుడైన ఎలీషాకు వినబడినప్పుడు అతడు నీ వస్త్రములు నీ వెందుకు చింపుకొంటివి?...**

ఇశ్రాయేలు రాజు తన వస్త్రములను చింపుకున్నాడని తెలుసుకున్న ప్రవక్తయైన ఎలీషా, నీవు నీ వస్త్రములను ఎందుకు చింపుకున్నావు? అతనిని నా దగ్గరకు పంపుము. అతడు నా దగ్గరకు వచ్చి, ఇశ్రాయేలులో ప్రవక్త ఉన్నాడన్న విషయాన్ని తెలుసుకొనును గాక అని రాజుకు వర్తమానం పంపెను. అప్పుడు నయమాను తన గుర్రములతోను, రథములతోను వచ్చి ఎలీషా ఇంటి వాకిట నిలిచెను.

## యోర్దానులో మునగమని ఎలీషా చెప్పుట

**2 రాజులు 5 : 10 – 12**

**10 ఎలీషా నీవు యొర్దాను నదికి పోయి యేడు మారులు స్నానము చేయుము, నీ ఒళ్లు మరల బాగై నీవు శుద్ధుడవగుదువని అతనితో చెప్పుటకు ఒక దూతను పంపెను...**

ఎలీషా ఇశ్రాయేలు రాజు దగ్గరకు మనుష్యులను పంపి, నయమాను ను నా దగ్గరకు పంపమని రాజుతో చెప్పగా, రాజు నయమాను ను ఎలీషా దగ్గరకు పంపెను. నయమాను ఎలీషా ఇంటి వాకిట నిలిచెను. అప్పుడు ఎలీషా తన సేవకుని ద్వారా నయమాను ను యోర్దానుకు వెళ్లి ఏడుసార్లు మునగమని, అప్పుడు నీవు శుద్ధుడవగుదువని వర్తమానం పంపెను. సేవకుడు అలాగే వెళ్లి చెప్పెను. దీనిని విన్న నయమాను చాలా కోపపడి,

అతడు తన దేవుని నామమును ప్రార్థించి, తన చేతితో ఆ రోగముగా ఉన్న స్థలముపై ఆడించి ఈ విధంగా కుష్టువ్యాధిని నివారణ చేస్తాడని అనుకున్నాను. నేను మునిగి శుద్ధుడవడానికి ఇశ్రాయేలు నదుల కంటే దమస్కు నదులైన అబానాయు పర్పరును మేలు కాదా? అని చెప్పి కోపంతో తిరిగి వెళ్లిపోయెను.

## నయమాను సేవకులు బ్రతిమాలుట

**2 రాజులు 5 : 13**

**అయితే అతని దాసులలో ఒకడు వచ్చి నాయనా, ఆ ప్రవక్త యేదైన నొక గొప్ప కార్యము చేయుమని నియమించిన యెడల నీవు చేయకుందువా? అయితే స్నానము చేసి శుద్ధుడవు కమ్మను మాట దాని కంటె మేలు కాదా అని చెప్పినప్పుడు**

ఎలీషా యోర్దానులో 7 సార్లు మునగమని తన సేవకుడు చెప్పిన మాట విని కోపంతో తిరిగి వెళ్తున్న నయమాను ను చూసి అతని సేవకులు అతని దగ్గరకు వచ్చి, తండ్రీ, ఆ ప్రవక్త ఏదైనా ఒక గొప్ప కార్యం చేయమని చెప్పి ఉంటే నీవు దానిని చేయుదువు గదా? యోర్దానులో 7 సార్లు మునుగుము, అప్పుడు నీవు శుద్ధుడవగుదువని మాత్రమే కదా చెప్పాడు. దీనిని చేయడం ఎంత అవసరం అని చెప్పారు. దీనిని విన్న నయమాను ఎలీషా మాట ప్రకారం యోర్దానులో మునగడానికి వెళ్లెను.

## నయమాను మునిగి స్వస్థత పొందుట

**2 రాజులు 5 : 14 - 16**

**14 అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడు మారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహము వలెనై అతడు శుద్ధుడాయెను.**

తన సేవకులు తనని బ్రతిమాలినందున, నయమాను ఎలీషా చెప్పినట్లు యొర్దానులోకి దిగి ఏడుసార్లు మునిగెను. అప్పుడు అతని మాంసం చిన్న బాలుని దేహము వలె మారి శుద్ధుడయ్యెను. అప్పుడు అతడు తన పరివారమంతటితో ఎలీషా దగ్గరకు తిరిగి వచ్చి అతని ఎదుట నిలిచి, ఇశ్రాయేలులో ఉన్న దేవుడు తప్ప భూమి యందెక్కడను వేరే దేవుడు లేడని ఇప్పుడు తెలుసు కున్నాను. కాబట్టి, నీవు నీ దాసుని చేతి నుండి కానుకను గ్రహించవలెనని కోరెను. అప్పుడు ఎలీషా నేను దేనిని తీసుకోనని యెహోవా జీవము తోడు చెప్పుచున్నాననెను. అందుకు నయమాను మళ్ళీ అతనిని బ్రతిమాలి తీసుకోమని అడిగెను. కానీ, ఎలీషా దానిని తీసుకోకుండా నిరాకరించెను.

## నయమాను యెహోవాను సేవిస్తానని చెప్పుట

### 2 రాజులు 5 : 17 – 19

**17 అప్పుడు యెహోవాకు తప్ప దహనబలినైనను మరి యే బలినైనను ఇతరమైన దేవతలకు నేనికను అర్పింపను; రెండు కంచర గాడిదలు మోయుపాటి మన్ను నీ దాసుడనైన నాకు ఇప్పించకూడదా?**

నయమాను తన బహుమానాలను స్వీకరించకుండా నిరాకరించిన ప్రవక్తయైన ఎలీషాతో, రెండు కంచర గాడిదలు మోయగలిగినంత మట్టిని నీ దాసుడనైన నాకు ఇప్పించుము అని అడిగి తీసుకొని, ఇకపై నేను యెహోవాకు తప్ప అన్య దేవతలకు బలి అర్పించను. ఒక విషయంలో మాత్రం యెహోవా నన్ను క్షమించును గాక. నా యజమానియైన రాజు రిమ్మోను గుడిలోకి ప్రవేశించినప్పుడు అతనికి నేను ఆధారముగా నుండి పని చేయవలసి ఉంటుంది. ఇలా చేసే విషయంలో నన్ను క్షమించాలని కోరుకున్నాడు. అందుకు ఎలీషా నీవు సమాధానముతో వెళ్ళుమని పంపెను.

## గేహజీ లోభము

### 2 రాజులు 5 : 20 – 24

**20 అంతట దైవజనుడైన ఎలీషాకు సేవకుడగు గేహజీ సిరియనుడైన యీ నయమాను తీసికొని వచ్చిన వాటిని అంగీకరించుటకు నా యజమానునికి మనస్సు లేకపోయెను గాని, యెహోవా జీవము తోడు నేను పరుగెత్తికొని పోయి అతని కలిసికొని అతని యొద్ద ఏదైనను తీసికొందుననుకొని**

తన కుష్టువ్యాధి నయమైనందుకు ఎలీషాకు ఇచ్చిన కానుకను ఆయన తీసుకోకుండా తిరిగి పంపించడాన్ని చూసిన ఎలీషా సేవకుడైన గేహజీ, నేను నయమాను వెనుక వెళ్లి అతని నుండి ఏదైనా తీసుకుంటానని లోభత్వముతో నిండినవాడై, నయమాను ను వెంబడించెను. దీనిని చూసిన నయమాను తన రథము నుండి దిగి క్షేమమేనా అని అడిగెను. అప్పుడు గేహజీ క్షేమమేనని చెప్పెను. ప్రవక్తల శిష్యులలో ఇద్దరు యవ్వనస్థులు ఇప్పుడు ఎఫ్రాయిము మన్యము నుండి నా దగ్గరకు వచ్చారు. వారికి 35 కి. గ్రా. వెండిని, రెండు జతల వస్త్రాలను ఇవ్వవలెనని నా యజమానుడైన ఎలీషా నన్ను పంపెనని చెప్పెను. అప్పుడు నయమాను దయచేసి రెట్టింపు వెండిని తీసుకోమని అతనిని బ్రతిమాలి, 70 కి. గ్రా. వెండిని, రెండు జతల వస్త్రాలను ఇచ్చి అతని ఎదుట మోసుకొని వెళ్ళడానికి ఇద్దరు సేవకులను పంపెను. అతడు మెట్ల దగ్గరకు వచ్చినప్పుడు, వారి చేతి నుండి తీసుకొని ఇంట్లో దాచి, ఆ మనుష్యులను పంపివేసెను.

## నయమాను కుష్టు గేహజీకి అంటుకొనుట

### 2 రాజులు 5 : 25 – 27

**25 అతడు లోపలికి పోయి తన యజమానుని ముందర నిలువగా ఎలీషా**

**వానిని చూచి గేహజీ, నీవెచ్చట నుండి వచ్చితివని అడిగినందుకు వాడు నీ దాసుడనైన నేను ఎచ్చటికిని పోలేదనెను.**

గేహజీ నయమాను ను వెంబడించి అతని నుండి 70 కి. గ్రా. వెండిని, రెండు జతల వస్త్రాలను తీసుకొని వచ్చి, తన ఇంట్లో దాచిపెట్టి, ఏమీ తెలియనట్లు ఎలీషా ఎదుట వెళ్లి నిలిచెను. ఇతని రహస్యాలను తెలిసిన ఎలీషా గేహజీని చూసి, నీవు ఎక్కడ నుండి వచ్చావు? అని అడిగెను. అందుకు అతడు నీ దాసుడనైన నేను ఎక్కడికిని పోలేదని అబద్ధం చెప్పెను. అప్పుడు ఎలీషా అతనిని చూసి, ఆ మనుష్యుడు నిన్ను ఎదుర్కోవడానికి తన రథము నుండి దిగి వెనుతిరిగినప్పుడు నా మనస్సు నీతో కూడా రాలేదా? ద్రవ్యమును తీసుకోవడానికిని, వస్త్రములను, ఒలీవ తోటలను, ద్రాక్ష తోటలను, గొర్రెలను, ఎడ్లను, దాసదాసీలను సంపాదించుకోవడానికి ఇది సమయమా? కాబట్టి, నయమాను కుష్ఠము నీకును నీ సంతతికిని నిరంతరము అంటుకొని ఉండునని చెప్పెను. వెంటనే అతడు హిమము వంటి తెల్లని కుష్ఠురోగియై ఎలీషా సన్నిధి నుండి బయటకు వెళ్ళిపోయెను. ఈ సంఘటన మనకు ఏమి చూపిస్తుంది, దీనిని మనం ఎందుకు చూడాలి? ఇందులో మనం తెలుసుకోవలసినది ఏమిటి? ఈ సంఘటన గురించి యేసు ఏమైనా చెప్పారా? నయమాను వేసిన ఏడు మునకలు మనకు దేనిని సూచిస్తాయి? దీని గురించి లేఖనాల ఆధారంగా పరిశీలిద్దాం.

## నయమాను గురించి ఎందుకు పరిశీలించాలి

**1 కొరింథీయులకు 10 : 11; రోమీయులకు 15 : 4**

**“ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను.”**

**"ఏలయనగా ఓర్పు వలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి."**

పాత నిబంధనలో వ్రాయబడినవన్నీ నీడగా ఉన్నాయి. అవి మనకు మాదిరిలుగాను, యుగాంతంలో ఉన్న మనకు హెచ్చరికగాను ఉన్నాయి. ఇందువలన దేవునిపై నిరీక్షణ పెరిగేలా పూర్వము వ్రాయబడినవి బోధగా ఉన్నాయి. కాబట్టి, నయమాను కు జరిగిన ఈ సంఘటన ఎటువంటి హెచ్చరికలను, బోధలను ఇస్తుందో తెలుసుకోవడానికి నయమాను గురించి పరిశీలించడం మనకు ఎంతో అవసరం. లేఖనాలలో వ్రాయబడిన ఏ ఒక్క భాగం కూడా వృధాగా వ్రాయబడలేదు. అన్నీ ఏదో ఒక అర్థాన్ని ఇచ్చేవిగా ఉన్నాయి. ఇప్పుడు నయమాను స్వస్థత పొందిన దాని గురించి యేసు చెప్పిన మాటలను చూద్దాం.

## నయమాను శుద్ధుడైన దానిని యేసు పేర్కొనుట

**లూకా 4 : 27**

**27 మరియు ప్రవక్తయైన ఎలీషా కాలమందు ఇశ్రాయేలులో అనేక కుష్ఠరోగులుండినను, సిరియ దేశస్థుడైన నయమాను తప్ప మరి ఎవడును శుద్ధి నొందలేదని నేను మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**

కుష్టువ్యాధి నుండి విడుదల పొందిన నయమాను గురించి యేసు ఏమి చెప్పారంటే, ప్రవక్తయైన ఎలీషా ఇశ్రాయేలులో అనేక అద్భుతాలు చేస్తూ గొప్ప ప్రవక్తగా ఉండెను. ఆ రోజుల్లో ఇశ్రాయేలులో అనేకమంది కుష్టురోగులు ఉండేవారు. వారిలో ఎవరికీ కుష్టువ్యాధి నుండి విడుదల లభించలేదు. కానీ, సిరియా దేశస్థుడైన నయమాను మాత్రమే విడుదల పొందెనని యేసు

ఇశ్రాయేలీయులతో చెప్పెను. ఇశ్రాయేలులో ఎందరో కుష్టురోగులు ఉండటం దేనిని సూచిస్తుంది అంటే, ఇశ్రాయేలీయులు పాపములతో నిండి ఉండటాన్ని ఇది సూచిస్తుంది. సిరియా దేశస్థుడైన నయమాను తప్ప వారిలో వేరెవరికీ స్వస్థత కలుగకపోవడం అనేది, ఇశ్రాయేలీయులు కాని అన్యులు తమ పాపములు పూర్తిగా తొలగించబడి విడుదల పొందడాన్ని ఇది సూచిస్తుంది. ఇశ్రాయేలీయులు తమను తాము పాపులమని ఒప్పుకోకుండా గర్వముతో నిండి పాపము నుండి విడిపించే రక్షకుడైన యేసును విశ్వసించకుండా పోతారని, అన్యులు తమ పాపములను గుర్తించి దాని నుండి విడిపించేవాడు క్రీస్తు అని తెలుసుకొని విడిపించబడతారని యేసు ఇలా జరగబోయే సత్యాన్ని మాట్లాడెను. ఈ విధంగా, దేవునిచే ముందుగా నిర్ణయించబడిన వారు మాత్రమే తమ పాపములు పూర్తిగా తొలగించబడి పరలోక భాగ్యాన్ని పొందుతారు. అందులో ఈ నయమాను వలె తనను తాను గుర్తించి అన్యులలో పాపమును ఒప్పుకున్న వారు మాత్రమే స్వస్థత పొందడాన్ని గురించి యేసు చెప్పెనందున, ఇందులో మనకు ఏదో ఒక ముఖ్యమైన బోధ ఉందని చూస్తున్నాం. కాబట్టి, నయమాను వేసిన ఏడు మునకలలో దాగి ఉన్న సత్యాలను చూడటం మనకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## కుష్టురోగం యొక్క ఫలితం ఏమిటి?

కుష్టురోగం యొక్క ఫలితం ఎలా ఉంటుందంటే, కుష్టురోగం ఒక మనిషి శరీరానికి వస్తే, మొదటిగా అది శరీర అవయవాల పోలికను మరియు రూపాన్ని పూర్తిగా వికృతం చేస్తుంది. దీనివల్ల శరీర నిర్మాణం చూడలేనంతగా కురూపిగా మారి, స్పర్శను కూడా కోల్పోతుంది. ఇంకా కుష్టు శరీరంలో ఏ భాగంలో వస్తుందో ఆ భాగం ఎంతో దెబ్బతిని ఆ శరీర అవయవం పాడైపోతుంది. తలలో వచ్చిన కుష్టు అక్కడ నుండి మొదలై శరీరం అంతటా వ్యాపించి, పూర్తి శరీరాన్ని రూపం లేకుండా చేస్తుంది. అటువంటి వ్యాధి కంటి

భాగంలో వచ్చినప్పుడు కన్ను పాడైపోతుంది. చెవి వైపు వ్యాపించగానే చెవి పాడై పనిచేయకుండా పోతుంది. అలాగే ముక్కు, నోరు, చేతులు, కాళ్లు, ఇలా శరీరంలోని అన్ని అవయవాలు రూపం మారి స్పర్శ లేని స్థితిలో ఎంతో అసహ్యంగా కనిపిస్తాయి. వీటి వల్ల బాధితులు నెమ్మదిగా మరణిస్తారు. ఇంతటి భయంకరమైన వ్యాధే కుష్ఠురోగం.

## కుష్టురోగానికి సంబంధించిన ధర్మశాస్త్రం

### లేవీయకాండము 13 : 42 – 46

**44 వాడు కుష్ఠరోగి, వాడు అపవిత్రుడు; యాజకుడు వాడు బొత్తిగా అపవిత్రుడని నిర్ణయింపవలెను; వాని కుష్ఠము వాని తలలోనున్నది. 46 ఆ పొడ వానికి కలిగిన దినములన్నియు వాడు అపవిత్రుడై యుండును; వాడు అపవిత్రుడు గనుక ప్రత్యేకముగానే నివసింపవలెను; వాని నివాసము పాళెమునకు వెలుపల ఉండవలెను.**

కుష్ఠురోగం ఒకరి తలలో కనిపిస్తుంది. ఈ కుష్ఠు సోకిన వ్యక్తి చినిగిపోయిన బట్టను ధరించి, తన తలను కప్పుకోకుండా, పెదవిని మాత్రం కప్పుకొని, అతడు దారిలో వెళ్తున్నప్పుడు "అశుద్ధుడు, అశుద్ధుడు" అని చెప్పుకుంటూ వెళ్ళాలి. ఈ అశుద్ధత వేరొకరికి సోకకుండా ఉండేలా, అతడు కుష్ఠువ్యాధి ఉన్నంత కాలం పాళెము వెలుపల అంటే ప్రజలు నివసించే చోటుకు దూరంగా ఒంటరిగా నివసించవలెను (**సంఖ్యాకాండము 5:2**). ఈ విధంగా కుష్ఠురోగాన్ని గురించి ధర్మశాస్త్రం చెబుతోంది. ఇంతటి భయంకరమైన వ్యాధి, అందరి చేత అసహ్యించుకోదగిన వ్యాధి, మనుషుల మధ్య నివసించలేని వ్యాధి. ఇటువంటి కుష్టురోగానికి సంబంధించిన ధర్మశాస్త్రం యాజకులకు ఇవ్వబడింది. ఒకరు కుష్ఠురోగియా? కాదా? అన్నది యాజకుడే నిర్ణయించడానికి అనుమతించ-బడింది. ఈ కుష్టురోగం

గురించి దేవునిచే ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రంలో చట్టంగా ఇవ్వబడింది.

## కుష్టురోగం దేనిని సూచిస్తుంది?

**రోమీయులకు 5 : 12**

**ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను.**

కుష్టురోగం అనేది పాపాన్ని సూచిస్తుంది. ఈ కుష్టు తల నుండి ప్రారంభమైందని చూశాం. అలాగే ఆదాము ద్వారా ప్రారంభమైన పాప వ్యాధి, చివరకు మరణానికి దారితీస్తుంది. దేవుని వలె ఎల్లప్పుడూ జీవించేలా ఆయన పోలికలో సృష్టించబడిన మనిషి (**ఆదికాండము 1:26**) అవిధేయత చూపడం వల్ల, శిరస్సు వంటి మొదటి మనిషి ద్వారా ప్రారంభమైన వ్యాధి, శరీరం అంతటా వ్యాపించి-నట్లుగా పూర్తి మానవాళికి వ్యాపించింది. ఆ వ్యాధితో బాధపడుతున్న ఒకరి అన్ని అవయవాలు పనిచేయకుండా చేసినట్లుగా, దేవుడు మనిషిని ఎందుకోసం సృష్టించారో ఆ ఉద్దేశం లేకుండా, విఫలమైన విషయాన్ని ఇది సూచిస్తుంది. ఈ విధంగా, ఒక్క మనిషి ఆదాము ద్వారా పాపము, పాపం ద్వారా మరణం లోకంలో ప్రవేశించెను. కాబట్టి, కుష్టురోగం అనేది మానవాళి పాపాన్ని సూచిస్తుంది.

## పాపం వల్ల కలిగిన ఫలితం

**యెషయా 64 : 6**

**మేమందరము అపవిత్రులవంటి వారమైతిమి మా నీతిక్రియలన్నియు మురికి గుడ్డవలె నాయెను మేమందరము ఆకు వలె వాడిపోతిమి గాలి వాన కొట్టుకొనిపోవునట్లుగా మా దోషములు మమ్మును కొట్టుకొనిపోయెను**

పాపం మనిషిని ఏలుతున్నందున, అతడు తన స్పృహను కోల్పోయాడు. ఇందువలన నేను ఎటువంటి తప్పు చేయలేదని చెబుతూ, ఇతరులను నిందిస్తూ తను మంచివాడి వలె అనుకుంటాడు. ఆదాము మరియు హవ్వలు ఇలాగే చెప్పుకున్నారు. దీనినే కుష్ఠురోగం ఒక శరీరంలో వస్తే మొదట స్పర్శ కోల్పోవడాన్ని చూస్తున్నాం. రెండవది కుష్ఠురోగం శరీర అవయవాలను వికృతం చేసినట్లుగా, ఈ పాపం వల్ల అతడు కళ్లుండి చూడలేని గుడ్డివాడి వలె కళ్లు గ్రుడ్డివి చేయబడతాయి, చెవులు వినబడవు. క్రియలు చేయలేనంతగా చేతులు కుంచించుకుపోయి, శరీరం అంతా దెబ్బతిని పనిచేయలేని విధంగా రూపం మారిపోయింది. దీనికి కారణం పాపం అనే కుష్ఠు వ్యాధి ఫలితమే. ఇటువంటి పాప వ్యాధిగ్రస్తుడు అశుద్ధుడై, అతని నీతిక్రియలు మురికిగుడ్డల వలె కనిపిస్తూ, ఆకులు రాలిపోయినట్లు మరణం అతనిని కమ్ముకొని, గాలి కొట్టుకొని పోయినట్లుగా పాప అపరాధాల వల్ల యెహోవాకు దూరమయ్యాడు. వీటన్నింటికీ కారణం మనిషి అవిధేయత. కుష్ఠురోగం వంటి ఈ భయంకరమైన వ్యాధి అయిన పాపం పూర్తిగా తొలగించబడాలంటే, నయమాను ఏడుసార్లు మునిగిన తర్వాతే చిన్న బాలుని దేహం వలె మారి స్వస్థత పొందాడు. అలాగే మనం కూడా లేఖనాలు చెప్పే ఏడుసార్లు మునగడం అనే ఏడు మెట్ల ద్వారా శుద్ధులయ్యే మార్గం ఏమిటి? అన్నది లేఖనాల ఆధారంగా పరిశీలిద్దాం.

## ఏడు మునకలు దేనిని సూచిస్తాయి?

### ఎఫెసీయులకు 2 : 1

**మీ అపరాధముల చేతను పాపములచేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను.**

బైబిల్లో ఏడు అనే సంఖ్య ఎంతో ప్రాముఖ్యత కలిగినదిగా

కనిపిస్తుంది. ఉదాహరణకు ఏడు బూరలు, ఏడుగురు దూతలు, ఏడు బంగారు దీపస్తంభాలు, ఏడు నక్షత్రాలు, ఏడు తెగుళ్లు, ఏడు పాత్రలు, ఏడు ఉరుములు, ఏడుసార్లు మునగడం, ఏడు ముద్రలు, ఏడు సంఘాలు, ఏడుగురు స్త్రీలు, సృష్టిలోని ఏడు రోజులు, వారానికి ఏడు రోజులు ఇంకా లోకరీత్యా రంగులు ఏడు, స్వరాలు ఏడు ఇలా అనేక ఏడులు కనిపిస్తాయి. ఏడు అనేది ఒక సంపూర్ణతను సూచిస్తుంది. ఇందులో మనం ఇప్పుడు నయమాను యొర్దానులో మునిగి తన కుష్టువ్యాధి మారి తన దేహం చిన్న బాలుని వలె మారిన సంఘటన మనకు ఏ పాఠాన్ని ఇస్తుందో చూద్దాం. అపరాధం వల్ల, అవిధేయత వల్ల వచ్చిన కుష్టు వంటి పాపాలలో చచ్చినవారిగా ఉన్న మనలను, ఆ చచ్చిన స్థితి నుండి విడిపించి జీవాన్ని ఇవ్వడానికి వచ్చినవాడు యేసుక్రీస్తు. ఈ యేసుపై విశ్వాసం ఉంచేలా, నయమాను కుష్టు నయమైన సంఘటన మనలను క్రీస్తు నొద్దకు నడిపించే బాలశిక్షకుడుగా ఉంది (**గలతీయులకు 3:24**). ఇందుకోసమే నయమాను సంఘటన వ్రాయబడింది. ఈ నయమాను ఒక గొప్ప పరాక్రమశాలి అయినప్పటికీ, తాను ఒక కుష్టురోగిని అని గుర్తించినప్పుడు ఎవరు నాకు విడుదల ఇస్తారని తెలుసుకొని వచ్చినట్లుగా, నేను ఒక పాపిని అని గుర్తించిన వారు తమ పాపము పోగొట్టుకొని శుద్ధులు కావాలంటే, పాపమును పోగొట్టే బలి యేసు అని తెలుసుకొని ఆయన దగ్గరకు రావాలి. ఇలా వచ్చిన వారు దాటవలసిన అత్యంత ముఖ్యమైన ఏడు మెట్ల గురించి లేఖనాలు చెబుతున్నదే నయమాను ఏడు మునకలు. ఈ ఏడు మునకలనే ఏడు మెట్లను ఒకడు దాటి వచ్చిన యెడల అతడు శుద్ధుడవుతాడు. తాను ఎవరో తెలియని పాపం, కుష్టురోగం వలె మనిషి శరీరం అంతటా వ్యాపించి అన్ని అవయవాలను పనిచేయకుండా చేసినట్లుగా, పాపం అనే వ్యాధి కూడా సకల మనుష్యుల శరీర అవయవాలను దేవుని చిత్తం చేయకుండా పనిచేయ-

కుండా చేస్తుంది. ఒకరి పాపపు కుష్టు పూర్తిగా తొలగిపోవాలంటే, నీడగా నయమాను మునిగిన ఏడు మెట్లను దాటి రావాలి అనే విషయాన్ని ఈ నయమాను ఏడు మునకలు సూచిస్తాయి. ఈ ఏడు నీడలైన మునకలు నిజంలో ఏవంటే: **1. తాను పాపిని అని గుర్తించడం, 2. సత్యాన్ని వాంఛతో వెతకడం, 3. పాపాన్ని విడిచిపెట్టడం, 4. బాప్తిస్మమనే నిబంధన, 5. నిబంధనని నెరవేర్చడం, 6. ప్రేమలో పరిపూర్ణులవ్వడం, 7. మరణం వరకు నమ్మకంగా ఉండటం.**

## 1. తాను పాపిని అని గుర్తించడం

**1 యోహాను 1 : 9**

**9 మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును.**

మొదటి మునక దేనిని సూచిస్తుంది అంటే, తాను ఒక కుష్టురోగి వంటి పాపిని అని మొదట ఒకరు ఒప్పుకోవాలి. అలా ఒప్పుకొనేవారు నా పాపమును పోగొట్టే బలిగా తనను తాను విమోచన క్రయధనముగా ఇచ్చినవాడు యేసు అని విశ్వసించాలి (**1 తిమోతి 2:6**). ఈ యేసు మాత్రమే నా పాపమును పోగొట్టే ద్వారము అని, ఆయన ద్వారా వెళ్తేనే పాపము తొలగిపోతుందని విశ్వసించాలి (**యోహాను 1 0 : 9** ). ఇలా విశ్వసించేవారు తమ పాపములను క్షమించి, సమస్త అనీతిని తొలగించి, శుద్ధులను చేయడానికి యేసు నమ్మదగినవాడును నీతిమంతుడునై ఉన్నాడని, పాపమును పోగొట్టే ఏకైక మార్గం యేసు మాత్రమే అని విశ్వసిస్తేనే రక్షించబడతాము (**రోమీయులకు 10:9**). కాబట్టి, విశ్వాసము ద్వారానే నీతిమంతుడు జీవిస్తాడు (**హబక్కూకు 2:4; రోమీయులకు 1:17**) అనే

వచనాల ఆధారంగా, కుష్టు వంటి పాపం ఒక మనిషిని విడిచిపోవాలంటే, అత్యంత ముఖ్యమైన మొదటి మెట్టు నేను ఒక పాపిని అని గుర్తించి, దాని నుండి విడిపించబడటానికి యేసే ఏకైక మార్గమని విశ్వసించాలి. అలా విశ్వసిస్తే సమస్త అనీతిని తొలగించి మనలను శుద్ధులను చేయడానికి ఆయన నమ్మదగినవాడు అనేదే మొదటి మెట్టు.

## 2. సత్యాన్ని వాంఛతో వెతకడం

### 1 పేతురు 2 : 3

**3 క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి.**

నేను ఒక పాపిని అని ఒప్పుకొని, నా పాపములను పోగొట్టే బలిగా తనను తాను విమోచన క్రయధనముగా ఇచ్చిన యేసుపై విశ్వాసం ఉంచిన మనం, అదే స్థితిలో నిలిచిపోకుండా, ఎదిగే వారిగా కొత్తగా జన్మించిన శిశువుల వలె, నిర్మలమైన వాక్యముపై వాంఛ కలిగి ఉండి, నీరు వంటి సత్య వాక్యము ద్వారా శుద్ధీకరించబడటానికి అవి మనలను నడిపిస్తాయి **(ఎఫెసీయులకు 5:26)**. పాపులమైన మనం, పాపమును పోగొట్టే ఏకైక మార్గమైన యేసుక్రీస్తును విశ్వసించి, వాటిని గురించి వాంఛతో లేఖనాలను పరిశీలిస్తే, సుగుణవంతులుగా మారుతాము **(అపొస్తలుల కార్యములు 17:11)**. ఈ లేఖన పరిశోధన మనలను అదే స్థితిలో నిలిపివేయకుండా, తదుపరి మెట్టు వైపు నడిపిస్తుంది. పిల్లలు పాలను మాత్రమే తాగినట్లు, మనం కూడా లేఖనములపై మాత్రమే వాంఛ కలవారిగా ఉంటే, కుష్టువ్యాధి వంటి పాపం తొలగి శుద్ధులు కావడానికి సత్యం మనకు చెప్పిన వాటిని అమలు చేయడమే రెండవ మెట్టు.

## 3. పాపములను విడిచిపెట్టడం

**2 తిమోతి 2 : 19**

**19 అయినను దేవుని యొక్క స్థిరమైన పునాది నిలుకడగా ఉన్నది. ప్రభువు తనవారిని ఎరుగును అనునదియు ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతి నుండి తొలగిపోవలెను అనునది**

నేను ఒక పాపిని అని ఒప్పుకున్న మన పాపములను విమోచించేవాడు యేసుక్రీస్తు అని విశ్వసించిన మనం, సత్య వాక్యము పైనున్న వాంఛతో దానిని ఇష్టముతో పరిశోధించడంలో ఆసక్తి కలిగి, దానితో నిలిచిపోకుండా, ఆ సత్యము ద్వారా దేవునికి ఇష్టమైనది మరియు దేవునికి ఇష్టం లేనిది ఏమిటో తెలుసుకొని, ఆయనకు ఇష్టమైనది చేస్తూ, ఇష్టం లేని వాటిని విడిచిపెట్టడానికి మనలను హెచ్చరిస్తుంది. ఇంకా, ఈ వచనాల ద్వారా మనం నేర్చుకున్న దీనమనస్సును, సాత్వికమును, దీర్ఘశాంతమును కలిగి, ప్రేమతో ఒకరికొకరు సహాయం చేస్తూ, సమాధానముతో ఏకమనస్సును కాపాడుకోవడంలో జాగ్రత్తగా ఉంటాము (**ఎఫెసీయులకు 4:2-3**). సత్య వాక్యము పైనున్న వాంఛతో వాటిని పరిశీలించిన మనం సత్య వాక్యము ద్వారా జన్మించిన వారము గనుక ఆయన వాక్యము మనలో ఉంది. కాబట్టి, పాపం చేయకుండా మనలను మనం వాక్యములో కాపాడుకుందాం. దీనివల్ల మనం దేవుని పిల్లలమని నిరూపించుకుంటాం (**1 యోహాను 3:9-10**). ఈ విధంగా, పాపం చేయకుండా ఉంటాము. ఒకవేళ ఇష్టం లేని కొన్ని పరిస్థితులలో అనివార్యంగా పాపం చేయవలసి వస్తే, దానికోసం పశ్చాత్తాపపడితే, నీతిమంతుడైన యేసు మనలను పాపం నుండి విమోచించడానికి మన తరపున తండ్రి యొద్ద విజ్ఞాపన చేసేవాడుగా ఉన్నాడు (**1 యోహాను 2:1**). కాబట్టి, మనం దేవునికి ఇష్టమైన వాటిని చేస్తూ, ఆయనకు ఇష్టం లేని వాటన్నింటిని అసహ్యించుకొని విడిచిపెడితే అది మేలైనదిగాను, దేవునికి ఇష్టమైనదిగాను మార్చే మూడవ మెట్టు.

## 4. బాప్తిస్మమనే నిబంధన

### 1 పేతురు 3 : 21

**21 దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు
చున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదు గాని
యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన
మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే.**

పాపములను విడిచిపెట్టి దేవునికి ఇష్టమైనది చేయడం నేర్చుకున్న మనం అందులో నిలిచిపోకుండా, అది మనలను దేవునితో నిబంధన చేసుకునేలా నడిపిస్తుంది. ఇది దేవునితో చేసుకునే బాప్తిస్మ నిబంధన. ఇది బాహ్య గుర్తైన నీటిలో మునిగి తీసుకునే బాప్తిస్మము. దీనివల్ల క్రీస్తుతో కూడా ఈ లోకానికి మరణించి, ఆయనతో కూడా పునరుత్థానమవుతాము అనడానికి ఒక గుర్తు. కాబట్టి, మనలను మనం దేవునికి సజీవ యాగముగా అప్పగించుకొని ఆయనను ఘనపరిచే వారిగా ఉండాలి (**రోమీయులకు 12:1**). ఈ విధంగా సజీవ యాగముగా అప్పగించుకొని, నూతన జీవము కలిగిన మనం మన సొంత చిత్తాలకు, ఇష్టాలకు జీవించకుండా, క్రీస్తులో కూడా ఆయన కోసం జీవించడానికి బాప్తిస్మము ద్వారా లోక ఆచారాలకు పాతిపెట్టబడాలి (**రోమీయులకు 6:4**).

ఈ విధంగా పాతిపెట్టబడి క్రీస్తులో ఉంటే నూతన సృష్టిగా, పాత స్వయం ఇష్టాలకు మరణించి, క్రీస్తులో బ్రతికి ఉంటాము (**2 కొరింథీయులకు 5:17**). ఇలా బాప్తిస్మములో యేసుతో కూడా పాతిపెట్టబడి ఆయనతో కూడా బ్రతికి ఉన్నాము, కాబట్టి ఇక మనకు ఇష్టమైనది కాదు, దేవుని చిత్తాన్ని చేయడానికి వస్తున్నాను అనే నిబంధనని చేస్తాము. అలా, ఆయనతో నిబంధన చేసుకున్న మనలను పరిశుద్ధులు అని

పిలువబడతాము (కీర్తన 50:5). పరిశుద్ధులని పిలువబడినంత మాత్రాన పరిశుద్ధులం కాలేము. సంపూర్ణ పరిశుద్ధులు కావడానికి ఇంకా మిగిలిన మెట్లను దాటి వెళ్ళాలి. కాబట్టి, మనలను వెంబడించిన కుష్టు వంటి పాపం మనలను విడిచి పూర్తిగా పోవడానికి బాప్తిస్మ నిబంధన చేసుకోవడం నాలుగవ మెట్టు.

## 5. చేసిన నిబంధనను నెరవేర్చడం

### 1 యోహాను 2 : 6

**6 ఆయనయందు నిలిచియున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడైయున్నాడు. మనమాయనయందున్నామని దీని వలన తెలిసికొనుచున్నాము.**

క్రీస్తుకు తనను తాను బలిగా అప్పగించుకొని నిబంధన చేసుకున్న మనం, యేసు తండ్రి ఎదుట ఎలా నడిచారో అలాగే మనం కూడా తండ్రికి ఇష్టమైన వాటిని యేసులో చేయాలి. ఇంకా దేవునికి తనను తాను సజీవ యాగముగా అప్పగించుకొని, ఆయన చిత్తం చేస్తానని నిబంధన చేసుకున్న మనం ఆ నిబంధనని నెరవేర్చడానికి ఆలస్యం చేయకూడదు. మ్రొక్కుకున్న దానిని చెల్లించవలెను (ప్రసంగి 5:4; కీర్తన 66:14). మ్రొక్కుకున్నది అంటే లోకరీత్యా మ్రొక్కుబడులను ఇక్కడ సూచించడం లేదు. మ్రొక్కుకున్న నిబంధన అంటే తన జీవిత కాలంలో ఏది చేసినా దేవుని కోసం చేస్తానని మొక్కుకున్న దానిని సూచిస్తుంది. కాబట్టి, ఆ మొక్కుబడులను నెరవేర్చడంలో ఎంతో శ్రద్ధ కలిగి ఉండాలి. దేవునికి మనలను మనం సజీవ యాగముగా అప్పగించుకున్న మనం, దేవుడు మనకు ఇచ్చిన డబ్బు, వస్తువులు, సమయం, తలాంతులు, సామర్థ్యాలు అన్నింటిని దేవుని చిత్తం చేయడానికి ఇవ్వాలి. దీనినే నీ యొద్ద నుండి పొంది నీకే ఇస్తున్నాము

అనడానికి అర్థం. మన దగ్గర ఉన్నవన్నీ దేవుడు ఇచ్చినవే. దేవుని క్రియలను చేసి ముగించడమే నా ఆహారమై ఉన్నదని యేసు చెప్పారు (**యోహాను 4:34**). యేసు తనను తాను దేవునికి అప్పగించుకున్నట్లుగా మనం కూడా మనలను ఆయనకు అప్పగించుకొని ఆయన చేసినట్లు చేసి నెరవేర్చడమే మనకు ఆహారంగా ఉంది. ఈ విధంగా మొక్కుబడులను నెరవేర్చడం ఐదవ మెట్టు.

## 6. ప్రేమలో పరిపూర్ణులవ్వడం

**గలతీయులకు 5 : 22 - 23**

**22 అయితే ఆత్మ ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము.**

**23 ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు.**

మొక్కుబడులను నెరవేర్చడంలో శ్రద్ధ కలిగిన మనలను అది ఫలించే అనుభవానికి నడిపిస్తుంది. ఇక్కడ చెప్పబడిన ఆత్మ ఫలమైన ప్రేమ అనే ఫలము అన్ని సద్గుణాలకు పుట్టిన ఇల్లు. ఈ ప్రేమ ప్రతిబింబం వల్ల మిగిలిన ఎనిమిది గుణ లక్షణాలు బయటపడతాయి. ఆత్మ ఫలాలలో ప్రేమ అనేది ఒకటి మాత్రమే కాదు, ప్రేమ ఉంటేనే మిగిలిన అన్ని మంచి గుణాలు పనిచేస్తాయి. ప్రేమ లేకపోతే ఇతర గుణ లక్షణాలు నకిలీవిగా కనిపిస్తాయి. కాబట్టి, అన్ని మంచి గుణ లక్షణాలు ప్రేమలో పరిపూర్ణమవ్వాలి. ఈ ప్రేమ ఎన్నటికీ క్షీణించదు. అది ఉప్పొంగదు. ఇంకా ప్రేమకు దీర్ఘశాంతము ఉంది. అది మత్సరపడదు, డబ్బా కొట్టుకోదు, కఠినంగా ఉండదు, దేవునికి ఇష్టమైనది చేస్తుంది, దేవునికి ఇష్టం లేనిది చేయదు, తనను ఇతరులు పొగడాలని ఆశించదు, అది కోపపడదు, ఇతరులకు కీడు చేయదు,

మంచి విషయంలో మాత్రమే సంతోషిస్తుంది, ప్రేమ అన్నింటిని ఓర్చును, అన్నింటిని విశ్వసించును, అన్నింటిని నిరీక్షించును, అన్నింటిని సహించును. ఇటువంటి ప్రేమ గుణాలన్నీ మనలో కనిపిస్తే ప్రేమలో పరిపూర్ణులమవుతాము. ఇక్కడ ప్రేమ అని చెప్పబడిన చోట మనలను మనం జత చేసుకుని దానిని అనుభవంగా మార్చుకోవాలి (1 **కొరింథీయులకు 13:1-8**). ఈ ప్రేమ ఎన్నటికీ గతించదు, అన్నీ గతించిపోతాయి. మనలను విడిచి ఎన్నడూ నశించని ప్రేమను ధరించుకున్న వారిగా ఉందాం. ఈ ప్రేమలో పరిపూర్ణులవ్వడమే ఆరవ మెట్టు.

## 7. మరణం వరకు నమ్మకంగా ఉండటం

### మత్తయి 24 : 13

**అంతము వరకు సహించినవా డెవడో వాడే రక్షింపబడును.**

ప్రేమలో పరిపూర్ణులై ఆరవ మెట్టును దాటి వచ్చిన మనం, అంతము వరకు అంటే మరణం వరకు లేదా రూపాంతరం చెందే వరకు నిలిచి ఉండటానికి పిలువబడుతున్నాము. వీటన్నింటిని శ్రమల ద్వారానే దాటి రావాలి, అనేక శోధనలు మనలను శోధిస్తాయి. వాటిలో మరణం వరకు సత్యాన్ని కాపాడాలి. అప్పుడే శుద్ధులము కాగలము (**ప్రకటన 2:10**). వీటన్నింటిలో ఏ విషయంలోనూ తక్కువ కాకుండా పరిపూర్ణులయ్యేలా ఉండాలి (**యాకోబు 1:4**). ఈ అన్ని మెట్లను దాటి వచ్చే కీడు దినమందు వాటిని ఎదిరించడానికి, దేవుని చిత్తం ప్రకారం సమస్తమును చేసి ముగించడానికి అర్హులుగా ఉండేలా దేవుని సర్వాంగ కవచమును ధరించుకున్న వారిగా ఉంటే (**ఎఫెసీయులకు 6:13**), ఏడు మెట్లను దాటి మన పాపపు కుష్టు తొలగి పూర్తి శుద్ధులమై దేవుని కుమారుని పోలికను ధరించుకున్న వారిగా మారుతాము. ఈ విధంగా, అంతము వరకు నిలిచి ఉండేవాడే రక్షించబడతాడు. ఇది ఏడవ మెట్టు.

నయమాను ఏడు మునకల రహస్యం నయమాను కుష్టు నివారణకు ఏడుసార్లు మునిగిన దాని రహస్యం ఏమిటంటే, పాప వ్యాధుల నుండి విడుదల పొందడానికి మొదట ఒకరు తాను పాపిని అని గుర్తించి, పాపమును పోగొట్టే బలి యేసు అని విశ్వసించి, సత్యంపై వాంఛ గలవారై ఉండి, పాపాన్ని విడిచిపెట్టి దేవుని చిత్తం చేస్తూ, దేవునితో బాప్తిస్మం అనే నిబంధన చేసుకోవాలి. అలా చేసుకున్న నిబంధన అయిన మొక్కుబడులను నెరవేర్చి, ప్రేమలో పరిపూర్ణులై దాటి వచ్చిన మెట్లన్నింటిలోనూ మరణం వరకు నమ్మకంగా ఉంటే, మనలను అంటుకున్న కుష్టు వంటి పాప వ్యాధి అంతా తొలగి చిన్న బాలుని స్థితికి చేరుకుంటాము అనే విషయాన్ని మనకు తెలియజేయడానికి నయమాను కుష్టురోగం నయమైన పాత నిబంధన సంఘటనను నీడగా పేర్కొని, దాని ద్వారా మనకు బోధను, హెచ్చరికను, మాదిరిని చూపించడానికి ఇవి వ్రాయబడ్డాయి. దీనినే, యేసు ఒకడు చిన్న బాలుని వలె మారకపోతే ఎవడును దేవుని రాజ్యాన్ని చూడలేడు అని చెప్పిన ఉద్దేశ్యం (**లూకా 18:17**). కాబట్టి, మనం కూడా ఇటువంటి ఏడు మునకలనే ఆత్మీయ ఏడు మెట్లను దాటి వస్తే చిన్న బాలుని దేహం వలె మారి మనం పూర్తిగా శుద్ధులమవుతాము. ఇదే నయమాను ఏడు మునకల రహస్యం.

## నయమాను మాత్రమే ఎందుకు శుద్ధుడయ్యాడు

**1 యోహాను 1 : 7, 9**

**7 అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల. మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును.**

**9 మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును.**

నయమాను అన్యులకు సాదృశ్యంగా ఉన్నాడు. ఈ అన్యుడైన నయమాను కు ఎలా కుష్టురోగం పూర్తిగా తొలగి విడుదల లభించింది అంటే, యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి కుష్టు అనే పాపం వల్ల నశించిపోతున్న మనిషి పాపాలు పూర్తిగా తొలగిపోయేలా యేసు సిలువలో మరణించి, ఆయన రక్తము ద్వారా ప్రతి పాపాన్ని తొలగించి వారిని శుద్ధులను చేస్తారు. ఎలా శుద్ధీకరించబడుతుంది అంటే, తాను ఒక పాపిని అని ఒప్పుకున్న వారి పాపములను క్షమించి, వారి అనీతిని తొలగించి శుద్ధీకరించడానికి ఆయన నమ్మదగినవాడై ఉన్నందున, ఈ నీడ అయిన నయమాను వంటి అన్యులు యేసుక్రీస్తు విమోచన క్రయధనం ద్వారా పూర్తి పాపం తొలగించబడి శుద్ధీకరించబడటాన్ని పాత నిబంధనలో నయమాను కుష్టు ఏడు మునకల ద్వారా పూర్తిగా తొలగి నయమవ్వడాన్ని నీడగా చూపబడింది. ధర్మశాస్త్రం ప్రకారం ఒకరి పాపం తొలగిపోవాలంటే వారు బలులు అర్పించాలి. కానీ, ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను పరిహరించలేదు అని **హెబ్రీయులకు 10:4** చెబుతోంది. కాబట్టి, పాత నిబంధనలో పూర్తి పాపం తొలగించడానికి అవకాశం లేకపోయినందున, ఇకముందు రాబోయే పూర్తి విడుదలను గురించి నీడగా చెప్పబడినదే నయమాను కుష్టు నయమవ్వడం. ఈ విడుదల తాను పాపిని అని ఒప్పుకొని విడిపించడానికి వచ్చిన యేసును విశ్వసించాలి. కానీ, తాను పాపిని అని గుర్తించకుండా, యేసును విశ్వసించకుండా ఇశ్రాయేలీయులు ఉన్నందున, దీని గురించే యేసు ఇశ్రాయేలులో ఎందరో కుష్టురోగులు ఉన్నా ఎవరికీ విడుదల లభించలేదు అని చెప్పిన ఉద్దేశ్యం (**లూకా 4:27**). అన్యుడైన నయమాను

ఎందుకు విడుదల పొందారు అంటే అతడు తనను తాను మొదట కుష్ఠురోగిని అని ఒప్పుకున్నాడు. అన్యులు తమ పాపాన్ని ఒప్పుకుంటారని, ఈ విధంగా ఏడు మెట్లను దాటి దానివల్ల పాపం నుండి పూర్తి విడుదలను పొందుతారని ఈ సంఘటన మనకు తెలియజేస్తోంది.

## ఏడు మునకలు మొదట మునిగినది యేసు

### 1 పేతురు 2 : 21

**ఇందుకు మీరు పిలువబడితిరి.క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగు జాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను.**

నయమాను తన కుష్ఠు నయం కావడానికి ఏడుసార్లు మునిగి శుద్ధుడైనది నీడగా చెప్పబడిన ఒక సంఘటన. ఈ నీడ అయిన సంఘటన యొక్క అర్ధమైన ఏడు మునకలను మొదట మునిగి యేసు మాదిరిగా మనకు చూపించారు. ఎలాగంటే, మనం ఆయనలో దేవుని నీతి అయ్యేలా పాపం తెలియని ఆయనను మానవాళి కోసం పాపంగా చేయడానికి అప్పగించి (**2 కొరింథీయులకు 5:21**), లోక మానవాళి అపరాధాలను తానే భరించి సిలువలో మరణించారు (**యెషయా 53:11**). దేవుడు ఆయనను సజీవంగా లేపుతారని ఆయన విశ్వసించారు (**హెబ్రీయులకు 5:7**). అలా విశ్వసించిన యేసు, తనను నిత్యజీవాన్ని కోల్పోయిన మానవాళి విమోచన క్రయధనముగా ఇవ్వడానికి వచ్చి, తాను చేయవలసిన వాటి గురించి చెప్పబడిన లేఖనాలను మోషే ధర్మశాస్త్రంలోనూ, ప్రవక్తల గ్రంథాలలోనూ పరిశీలించారు (**లూకా 24:44**). ఈ విధంగా, లేఖనాలను పరిశోధించినందున తండ్రి చిత్తం చేయడం మాత్రమే ఎంచుకొని తన చిత్తాన్ని విడిచి దేవుని చిత్తం చేశారు. ఎలాగంటే, దేవుడు ఆయనకు ఇచ్చిన వారిలో

ఎవరినీ పోగొట్టుకోకుండా యేసును విశ్వసించేవాడు నిత్యజీవం పొందేలా, అంత్య దినాన అతడిని లేపడం దేవుని చిత్తమై ఉన్నదని చెప్పి, పూర్తిగా తండ్రి చిత్తాన్నే చేయడం ఎంచుకొని (**యోహాను 6:38-40**), పరిశుద్ధుడుగా, నిరపరాధిగా, నిష్కల్మషుడుగా పాపులకు వేరుగా తనను తాను కాపాడుకున్నారు (**హెబ్రీయులకు 7:26**). యేసు ఇదిగో నీ చిత్తం నెరవేర్చడానికి వస్తున్నాను అని చెప్పి బాప్తిస్మం పొందడానికి బాప్తిస్మమిచ్చు యోహాను యొద్దకు వచ్చారు. అందుకు యోహాను ఆయనను అభ్యంతరపరిచారు. అప్పుడు, యేసు నీతి నిమ్మిత్తం ఇప్పుడు కానియ్యి; ఇలాగ సమస్త నీతిని నెరవేర్చుట మనకు యుక్తమై ఉన్నదని చెప్పి బాప్తిస్మమునకు తనను తాను అప్పగించుకున్నారు (**మత్తయి 3:13-16**). ఈ విధంగా, దేవునితో చేసుకున్న మొక్కుబడులన్నింటిని ఆయన నెరవేర్చారు. ఎలాగంటే, ధర్మశాస్త్రంలో తన గురించి వ్రాయబడిన వాటిని నెరవేర్చడానికే వచ్చారు (**మత్తయి 5:17**). ఈ విధంగా, తాను చెప్పిన మొక్కుబడులను తన పరిచర్య దినాలలో చేసి నెరవేర్చారు (**రోమీయులకు 10:4**).

ఈ విధంగా మొక్కుబడులను నెరవేర్చిన వారు ఆత్మ ఫలమైన ప్రేమలో పరిపూర్ణులై సత్య సువార్తను ప్రకటించి (**మార్కు 10:21**), ప్రజల పట్ల జాలిపడి తన ప్రేమను పూర్తిగా వెల్లడిపరిచారు (**యోహాను 3:16; ఎఫెసీయులకు 5:2**). ఈ విధంగా, ప్రేమను వెల్లడిపరిచిన వారు అంతము వరకు అంటే సిలువ మరణం వరకు తనను తాను అప్పగించుకొని అంతా ముగిసింది అని చెప్పి ఏడు మెట్లను చేసి నెరవేర్చారు (**యోహాను 19:28**). దేవుడు ఎందుకోసం యేసును భూమికి పంపారో వాటన్నింటిని ఆయన మనకు మాదిరిగా చేసి తండ్రి కుడి పక్కన కూర్చునేలా హెచ్చించబడ్డారు. అలాగే, ఏడు మెట్లను దాటి మనకు మాదిరిగా చూపించిన యేసు వలె మనం

కూడా ఈ ఏడు మెట్లను దాటి అంతము వరకు నిలిచి ఉంటే యేసుతో కూడా రాజ్యమెలే వారిగా ఉంటాము. జగదుత్పత్తికి ముందే ఎంచుకోబడిన అన్యులైన ప్రజల కుష్టు వంటి పాపం తొలగిపోవడానికి, అల్పులుగా ఎంచబడిన వారిచే హెచ్చరించబడి తద్వారా తాను పాపిని అని గుర్తించిన వారు యేసు ద్వారా వెల్లడిపరచబడిన సత్యం ద్వారా నడిపించబడి దానికి లోబడి ఏడు మెట్లను దాటి తన పాపపు కుష్టు పూర్తిగా తొలగి స్వస్థత పొందడాన్ని ఈ నయమాను నీడ సంఘటన మనకు బోధలుగా వ్రాయబడింది.

**యోహాను 8 : 32**

**అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పగా**

**యోహాను 17 : 17**

**నీ వాక్యమే సత్యము.**

దేవుడు తానే ఈ ఏడు మెట్లను దాటి శుద్ధులవ్వడానికి మనకు కృపనిచ్చును గాక!

**ఆమెన్**




# పరలోక దేవ మినిస్ట్రీస్



## సమర్పించు

# Free Bible Study (Telugu)

మరింత సమాచారం కోసం సంప్రదించగలరు.

+91 730 53 53 23 5 freebiblestudytelugu@gmail.com